



ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగింపజేస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

ఎస్జీఎఫ్ క్రీడలు విజయవంతం చేయండి

- 27లోపు మండల, సెప్టెంబరు 15 లోపు జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు
- డీఈవో చైతన్య జైనీ




సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో చైతన్య జైనీ

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ క్రీడల నిర్వహణలో జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులందరూ చురుకుగా పాల్గొని క్రీడల విజయవంతానికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల క్రీడా సమాఖ్య వార్షిక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వ్యాయామ ఉపాధ్యాయులు సంఘటితంగా క్రీడల నిర్వహణలో మంచి ప్రతిభ చాటుతున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఎస్జీఎఫ్ క్రీడలను ఈ నెల 18 నుంచి 27వ తేదీలోపు మండల స్థాయిలో, సెప్టెంబరు 15వ తేదీలోపు జిల్లాస్థాయిలో నిర్వహించాలన్నారు. జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడల నిర్వహణకు తమవంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్జీఎఫ్ క్రీడల నిర్వహణకు ప్రతి మండలానికి 10 వేల రూపాయల చొప్పున అందించాలన్నారు. క్రీడాకారులకు భోజనం, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చూడాలని డీఈవోను కోరారు. జిల్లాస్థాయి క్రీడలను వీలైనంతవరకు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలోనే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్ కార్యదర్శి నివేదికను సమర్పించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్ అశోక్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి ఎం స్వదేశ్‌కుమార్, వ్యాయామ విద్య సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంతటి శంకరయ్య, ఆడెపు శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్.. 7

'స్థానికం'పై దృష్టి



- పాదయాత్రకు కాంగ్రెస్ సన్నాహాలు
- స్థానికల ఎన్నికలే లక్ష్యంగా ప్రజల వద్దకు
- బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ విమర్శలు
- వరుస సమావేశాలకు కార్యాచరణ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మూడు నెలల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడంతో మరో రెండు నెలల్లోనే ఈ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రజల వద్దకు వెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సన్నాహాలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలని ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్‌కు పంపగా ఆయన దానిని కేంద్ర న్యాయశాఖ పరిశీలనకు పంపించారు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఈ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో ఈ ఎన్నికల్లో పైచేయిగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. బీసీలనంతా ఒక్కతాటిపైకి తెచ్చి కాంగ్రెస్‌కు అనుకూలంగా వారు నిలిచేలా చేయాలనే వ్యూహంతో ఈ రిజర్వేషన్ల వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది.

బీసీ సభలతో ప్రజల్లోకి బీఆర్ఎస్...

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని ఆర్డినెన్స్ జారీ చేయగా బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల పేరిట డ్రామా ఆడుతున్నదని విమర్శిస్తోంది. ఈ అంశంపై జిల్లాల్లో సభలు నిర్వహించి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను తెచ్చిన పార్టీగా కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లోనూ లబ్ధిపొందే అవకాశం ఇవ్వకూడదని బీఆర్ఎస్ భావిస్తున్నది. బీఆర్ఎస్ అంటేనే బీసీల పక్షపాతిగా నిలిచిన పార్టీ అని, బీసీలకు వివిధ పథకాలు ప్రారంభించడంతోపాటు అన్ని రాజకీయ అవకాశాలను కల్పించిన పార్టీగా నిలిచిందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. కాంగ్రెస్ బీసీ నినాదంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నదని విమర్శిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సభలను నిర్వహించి ఇదే ప్రచారాన్ని కొనసాగించి బీసీల మద్దతు కూడగట్టుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు గంపగుత్తగా కాంగ్రెస్‌వైపు వెళ్లకుండా నిలువరించాలని ఆ పార్టీ భావిస్తున్నది. అధికార, విపక్ష పార్టీలు రెండూ బీసీ నినాదం ఎత్తుకోవడంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నాయి.

బీఆర్ఎస్ సభ వాయిదా

జిల్లా నుంచే బీసీ సభలకు శ్రీకారంచుట్టాలని బీఆర్ఎస్ అధిష్టానం భావించి ఈ నెల 8న అందుకు ముహూర్తంగా నిర్ణయించింది. వర్షాల కారణంగా ఆ సభ వాయిదా పడగా 14న సభ నిర్వహించేందుకు

(మిగతా 8వ పేజీలో)

24న చొప్పదండిలో కాంగ్రెస్ పాదయాత్ర, శ్రమదానం

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రను నిర్వహించాలని నిర్ణయించారు. మొదటి విడత యాత్రను ఇప్పటికే పూర్తిచేసుకున్న ఆయన ఈ నెల 24న కరీంనగర్ జిల్లాలో తన రెండో విడత యాత్రను ప్రారంభిస్తున్నారు. 24న సాయంత్రం ఆయన చొప్పదండి నియోజకవర్గానికి చేరుకుని 10 నుంచి 15 కిలో మీటర్ల మేరకు ఆ పరిధిలో వచ్చే గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజలను కలుసుకుని నేరుగా ముచ్చటిస్తారు. పార్టీ పథకాల గురించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తారు. భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాల గురించి కూడా ఆయన వివరించి ప్రజల్లో ఆయా పథకాలపైన వాటిని అమలు తీరు పైన ఉన్న అభిప్రాయాలను తెలుసుకుని తీసుకు రావాల్సిన మార్పులపైన సూచనలను స్వీకరిస్తారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా ఈ పాదయాత్రలో పాల్గొననున్నారు. 25న వారు ఇదే నియోజకవర్గంలో జరిగే శ్రమదానం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు కార్యక్రమం రూపొందించారు. ఈ కార్యక్రమంలో వారు పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను సూచిస్తారు. స్థానిక సంస్థల్లో మెజార్టీ స్థానాల్లో పార్టీ ప్రతినిధులను గెలిపించుకోవడానికి అనుసరించవలసిన వ్యూహాల గురించి చర్చించి దిశానిర్దేశం చేస్తారని సమాచారం. ఎన్నికల కమిషన్ ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల్లో ఒకరిగా కలిసి పోయి పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేసే విధంగా కార్యకర్తలు, నాయకులకు ఈ సమావేశంలో కార్యాచరణను ఇస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు.

రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించొద్దు

- కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేయవద్దని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మంగళవారం నగరంలో కమిషనర్ పర్యటించారు. నగరంలోని రాజీవ్ చౌక్, శనివారం మార్కెట్‌ను సందర్శించి పారిశుధ్య పనులు, ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులను మెరుగ్గా చేయాలన్నారు. రోడ్లపై చెత్తపడకుండా పారిశుధ్య అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గార్బేజ్ పాయింట్లను శుభ్రపరిచి, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. డివిజన్ల వారీగా స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి తిరిగి చెత్తను వేరు చేసి సేకరించాలని, ప్రతి స్వచ్ఛ ఆటో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన డీఆర్‌సీసీకి వెళ్లాలని తెలిపారు. డీఆర్‌సీసీకి వెళ్లిన అనంతరమే మిగిలిన చెత్తను డంపునకు తరలించేలా జవాన్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్లను ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేసే వారికి జరిమాన విధించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వేణు మాధవ్, పారిశుధ్య, డీఆర్‌సీసీ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే..

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం-2007 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులశాఖ అధికారి ఎం సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు, వృద్ధులను పట్టించుకోకపోతే తెలంగాణ సీనియర్ సిటిజన్ మేయింటెనెన్స్ కేసెస్ మానిటరింగ్ సిస్టం(టీఎస్‌సీఎంఎంఎస్) పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. tgseniorcitizens.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుల పై సంబంధిత రెవెన్యూ అధికారి/కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

సైన్స్ వింగ్ కళాశాల భవనాన్ని వినియోగంలోకి తేవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీం నగర్ కార్ఖానగడ్డలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల(సైన్స్‌వింగ్)లోని నూతన భవనంలో సౌకర్యాలు కల్పించి, తరగతులు ప్రారంభించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సైన్స్ వింగ్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న స్క్రాప్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను పూర్తిగా తొలగించాలని అన్నారు. కళాశాలలో ఆరు తరగతులతో కూడిన నూతన భవన నిర్మాణం నాలు గేళ్ల క్రితం ఆగిపోయినందున ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ వెంకటరమణచారి ఉన్నారు.

స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్‌లో అన్ని పాఠశాలలు పాల్గొనాలి

కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్‌లో జిల్లాలోని అన్ని పాఠశాలలు పాల్గొనాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళ వారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో స్వచ్ఛ హరిత విద్యాలయ నమోదు, బుధవారం బోధన, ఇంగ్లీష్ క్లబ్, తదితర అంశాలపై మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం, తదితర వివరాలు స్వచ్ఛ హరిత విద్యాలయ యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కేంద్ర బృందం పరిశీలించి పాఠశాలలకు ర్యాంక్ ఇస్తుందని తెలిపారు. సమావేశంలో యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్‌స్వామి, స్వచ్ఛ భారత్ సమన్వయకర్త వేణుప్రసాద్, విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



సైన్స్‌వింగ్ కళాశాలలో అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్

మూన్నాళ్ల ముచ్చటేనా?

- అంధకారంలో తీగల వంతెన
- ముందుకు కదలని మానేరు రివర్ ఫ్రంట్ పనులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో వందల కోట్లతో చేపట్టిన మానేరు రివర్ ఫ్రంట్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తీగలవంతెనపై అంధకారం అలుముకుంది. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మానేరు రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ మంత్రుల నుంచి మొదలు కొని ముఖ్య మంత్రి వరకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు.

మంత్రి ప్రకటనతో ఆశలు

జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మానేరు రివర్ ఫ్రంట్ పనులను పూర్తి చేసేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు ప్రకటించడంతో ప్రజల్లో మళ్లీ ఆశలు రేకెత్తిస్తున్నాయి. మరోవైపు మానేరు రివర్ ఫ్రంట్ తీగల వంతెన నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయంటూ, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారంటూ పలువురు ఫిర్యాదు చేశారు.



చీకటిగా ఉన్న కేబుల్ బ్రిడ్జి

తీగల వంతెనపై ఇబ్బందులు

150కోట్లకు పైగా వెచ్చించి నిర్మాణం చేపట్టిన తీగల వంతెన ఏడాది తిరగకముందే రోడ్డు దెబ్బతినడం, లైట్లు వెలగకపోవడం, లైటింగ్ సిస్టం దెబ్బతినడంతో పూర్తి అంధకారంగా మారింది. దీంతో ఆ బ్రిడ్జి పై నుంచి వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు రాకపోకలను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. శాశ్వత ప్రాతిపదికన రోడ్డును పూర్తి చేసి డైనమిక్ లైటింగ్‌తో పాటు లైట్లు అన్ని వెలిగేలా చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

కరీంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అతి భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేయాలన్నారు. ఆకస్మిక వరదల సమయంలో ప్రజల ప్రాణాల రక్షణకు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వరద సహాయ చర్యలకు కలెక్టర్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించాలని, అక్కడ వారికి అవసరమైన వైద్యం, ఆహారం, ఇతర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్పొరేషన్ ప్రాంతాల్లో ముందుగానే అవసరమైన బృందాలను సిద్ధంగా పెట్టుకోవాలని అన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, నీటి వనరుల సమాచారం తెలుసుకుని, వాటికి సమీపంలో ఉన్న రోడ్లు, వంతెనలపై రాకపోకలను నిలిపివేయాలని, దీనికోసం స్థానిక పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆసుపత్రి వరకు వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. భారీ వరదల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులు దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం

కరీంనగర్ అర్బన్: భారీవర్షాల నేపథ్యంలో కరీంనగర్ కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ సూచనల మేరకు ముందు జాగ్రత్త చర్యగా కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలకు సహాయం కోసం 0878-2997247 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. కంట్రోల్‌రూం సేవలు 24 గంటలపాటు అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాల కారణంగా ఎక్కడైన ఇబ్బందులు ఎదురైతే సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గణేశ్‌నగర్: రాష్ట్రంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల పరిధిలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు, సిబ్బంది విధిగా హెడ్ క్వార్టర్‌లో ఉండి విధులు నిర్వర్తించాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తూ ఉండాలని, ఎక్కడైనా అంతరాయాలు కలిగితే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. షిఫ్ట్ విధానంలో 24 గంటలు విధులు కేటాయించాలని అన్నారు. వరదల కారణంగా ఎక్కడైనా విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఆ ప్రాంతాల్లో జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారులు ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్నా టీజీఎన్‌పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా తెలియజేయాలని సూచించారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ రఫుల్ దేశాయ్‌తో నగర సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ నగరంలో పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని, దీంతో నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మంత్రులు సమస్యలను పరిష్కరిస్తామని చెబుతున్నారే కానీ పట్టించుకోవడం లేదన్నారు. కమిషనర్‌గా 10 కోట్ల రూపాయల వరకు అవసరమైన పనులను చేపట్టేందుకు అధికారం ఉంటుందని, వాటితో అత్యవసరమైన పనులను పూర్తి చేయాలని కమిషనర్‌కు సూచించారు. వరద కాల్వల్లోని పూడిక తీయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయన్నారు. వరద కాలువల్లోని పూడిక తీసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు రమణారావు, గందె మాధవి పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారికి జరిమానా

ఇల్లంతకుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన 21 మందికి సిరిసిల్ల సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను మంగళవారం కోర్టు కానిస్టేబుల్స్ జీవన్, తిరుపతి కోర్టులో ప్రవేశపెట్టగా సిరిసిల్ల సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు తెలిపారు.

భార్య, అత్త వేధింపులు.. యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాలాపూర్ గ్రామంలో అత్త, భార్య సూటిపోటీ మాటలతో వేధించడంతో తట్టుకోలేక ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాలాపూర్ గ్రామానికి చెందిన గుడిసె మహేందర్ (24) హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన ప్రవళికను రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఈ నెల 1న పాప జన్మించింది. వివాహం జరిగినప్పటి నుంచి వీరి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. భార్య ప్రవళిక, అత్త ఎల్లమ్మ మహేందర్‌ను ఇష్టానుసారంగా దూషించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 4న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు మహేందర్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

జమ్మికుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని నాయిని చెరువులో ప్రమాదవశాత్తు పడి మహమ్మద్ జబ్బర్ (64) అనే మతిస్థిమితం లేని వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. ఈ నెల 12న ఇంటి నుంచి ఉదయం బయటకు వెళ్లిన జబ్బర్ ఎంతకూ తిరిగి రాలేదు. కుటుంబసభ్యు లు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీసిన ఫలితం లేకుండా పోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

చోరీకి యత్నం

రాయికల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన పిప్పరి పురుషోత్తం ఇంట్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పురుషోత్తం వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన కొడుకు ఇంటికి వెళ్లాడు. కాగా ఇది గమనించిన దుండగులు సోమవారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు, పురుషోత్తంకు సమాచారం అందించారు. పోలీసులు, పురుషోత్తం కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ పోలేవని గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హన్మాజీపేట గ్రామంలోని గుట్ట

గుట్ట కోసం ఏకమయ్యారు..

- పర్యావరణ పరిరక్షణకు హన్మాజీపేట గ్రామస్థుల ప్రయత్నం
- మొరం టెండర్ రద్దు చేయాలని ఆందోళన

జగిత్యాలరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలోని గుట్టను కాపాడడం కోసం ఊరంతా ఏకమయ్యారు. హన్మాజీపేట గ్రామంలోని సర్వేనంబర్ 596లో గల గుట్ట మొరం తరలించేందుకు ప్రభుత్వం టెండర్ పిలిచినట్లు గ్రామస్థులకు తెలిసింది. గుట్ట నుంచి మొరం తరలించడం ద్వారా పర్యావరణం దెబ్బతిని గ్రామం ఎడారిగా మారే ప్రమాదం ఉందని హన్మాజీపేట వాసులు ఆందోళన చెందుతున్నారు. గుట్టను కనుమరుగు చేసేవిధంగా జారీ అయిన టెండర్లను రద్దు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను, మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని, పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. గుట్ట మొరం తరలింపుతో జరిగే నష్టాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు.

గుట్టపై పురాతన ఆలయాలు

ప్రకృతి రమణీయతకు నెలువైన గుట్టపై తాము దైవంగా భావించే అతి ప్రాచీన రామాలయం, అంజనేయస్వామి, పెద్దమ్మతల్లి వంటి ఆలయాలు ఉన్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గుట్ట మట్టిని తరలిస్తే కోల్పోతామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతనమైన హన్మాజీపేట గుట్ట పశువులకు, జంతువులకు, ఇతర జీవరాశులకు జీవానాధారంగా ఉందన్నారు.

దీంతో గుట్ట నుంచి మొరం తరలించే టెండర్ ప్రక్రియను ఆపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. టెండర్ ప్రక్రియను రద్దు చేయకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హన్మాజీపేట గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

టెండర్ రద్దు చేయాలి

గొడుగు సురేష్, హన్మాజీపేట



పురాతనమైన గుట్ట పశువులకు, జంతువులకు, ఇతరజీవరాశులకు జీవనాధారంగా ఉంది. గుట్టపైన తాము ఆరాధ్యదైవంగా భావించే పురాతనమైన పెద్దమ్మతల్లి, రామాలయం, ఆంజనేయ ఆలయాలు ఉన్నాయి. గుట్టనుండి మొరం తరలిస్తే పర్యావరణం దెబ్బతిని హన్మాజీపేట, కండ్లపల్లి, పొరండ్ల, బాలపల్లి గ్రామాలు కాలుష్యం అవుతాయి. గుట్ట మొరం తరలించే టెండర్‌ను రద్దు చేయాలి.

గుట్టను కాపాడాలి

గాలిపెల్లి శ్రీధర్, హన్మాజీపేట



హన్మాజీపేటలోని గుట్టనుండి మొరం తరలించేందుకు టెండర్ పిలుస్తున్నట్లు మాదృష్టికి వచ్చింది. మూడు గ్రామాలకు నెలువైన గుట్ట నుంచి మొరం తరలిస్తే చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు చాలా నష్టపోతారు. వెంటనే మొరం తరలించే టెండర్‌ను రద్దు చేసి గుట్టను కాపాడాలి. టెండర్ రద్దు చేయకపోతే అందోళనలను మరింత ఉధృతం చేస్తాం.



మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న హన్మాజీపేట గ్రామస్థులు(ఫైల్)

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఏసీపీ వెంకటస్వామి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ వెంకటస్వామి

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి సూచించారు. మానకొండూర్‌లో మంగళవారం కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తూర్పు దర్వాజ బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. యువత వ్యసనాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుంబానికి, గ్రామానికి, మంచిపేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లో దొంగతనాల నివారణకు రాత్రివేళల్లో యువత గస్తీలుగా తిరగాలన్నారు. అనంతరం సైబర్ నేరాల పోస్టర్‌ను గ్రామస్థుల సమక్షంలో ఆవిష్కరించారు. అంతకు ముందు గ్రామంలోని వీధుల గుండా పోలీసులు తిరిగి కాగితాలు, నంబర్ ప్లేట్ లేని 69 వాహనాలను గుర్తించి పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్థానిక సీఐ సంజీవ్, తిమ్మాపూర్, కొత్తపల్లి, సీఐలు సదన్‌కుమార్, కోటేశ్వర్, పుల్లయ్య, ఎస్ఐ స్వాతి, పోలీసులు ఉన్నారు.

కాల్వలో పడి ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాకతీయ ఉపకాల్వలో పడి ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లికి చెందిన ఎ సంపత్ అనే వ్యక్తి మండలంలోని అన్నారం గ్రామంలో బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి వెళ్తున్నాడు.

కాగా పోచంపల్లి గ్రామ శివారుకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కాకతీయ ఉపకాల్వలో పడ్డాడు. సదరు వ్యక్తి అరుపులు విన్న బాటసారులు గమనించి స్థానికుల సహాయంతో బయటికి తీశారు. తీవ్రగాయాలైన సంపత్‌ను 108 వాహనంపై కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీసా కోసం డబ్బులు వెచ్చించి మోసపోయిన యువతి

- మనస్తాపంతో ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విదేశాలు వెళ్లడానికి వీసాల కోసం ఖర్చులుపెట్టి ఆర్థికంగా నష్టపోయిన జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన నల్లమోతు హర్షిత (25) అనే యువతి పురుగుల మందుతాగి మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నల్లమోతు హర్షిత కుటుంబసభ్యులు 25 ఏళ్ల క్రితం జగిత్యాల మండలం హస్నాబాద్‌కు వలస వచ్చి నివాసం ఉంటున్నారు. ఇటీవలే డిగ్రీ పూర్తిచేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాలని ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా యూనివర్సిటీల కోసం తెలిసిన వ్యక్తుల ద్వారా ప్రయత్నించింది. అమెరికాలోని తప్పుడు యూనివర్సిటీని ఎంచుకొని మోసపోయింది. తద్వారా వీసాల కోసం సుమారు 10 లక్షల రూపాయల వరకు డబ్బులను వెచ్చించి ఆర్థికంగా నష్టపోయింది. చివరి ప్రయత్నంలో భాగంగా జర్మనీ దేశానికి వెళ్తానని ఇంట్లో తండ్రికి చెప్పడంతో తండ్రి శ్రీనివాస్ ఇప్పటికే చాలా డబ్బులు ఖర్చుచేశావని వద్దని వారించారు. దీంతో మనస్తాపం చెందిన యువతి తాను విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే కల నేరవేరదని భావించిన హర్షిత ఈనెల 6 వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా బంధువులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం హర్షిత మృతి చెందింది. మృతురాలు హర్షిత తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.



హర్షిత (ఫైల్)

మోర్ సూపర్‌మార్కెట్‌లో.. ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమాన్ ప్రాంతంలోని మోర్ సూపర్‌మార్కెట్‌లో మంగళవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన పదార్థాలను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఫేడ్ ఐటమ్స్‌ను విక్రయిస్తున్నారనే సమాచారంతో మోర్ సూపర్‌మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించామని కరీంనగర్ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ అంకిత్‌రెడ్డి తెలిపారు. నూడుల్స్, చిక్కి ప్యాకెట్లు, ధనియాల ప్యాకెట్లు గడువు ముగిసినప్పటికీ విక్రయిస్తున్నట్లు గుర్తించి డస్ట్‌బిన్‌లో పారేశామని తెలిపారు. చాలారకాల ఫైడ్ ఐటమ్స్ రెండు నుంచి ఏడు రోజుల వ్యవధిలో గడువు ముగుస్తున్నట్లు గుర్తించామని, వీటన్నిటినీ తొలగించాలని ఆదేశించామని అన్నారు. మోర్ సూపర్ మార్కెట్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

గంజాయి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయాధికారి కె ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలకు చెందిన మహేష్ అలియాస్ నాయక్ మల్లేష్, జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన గడ్డం బువన్‌కు శిక్ష విధించారు. జల్సాలకు అలవాటుపడి వీరిద్దరూ అక్రమార్జన కోసం 2021 ఏప్రిల్ 28న మోతుగూడెం నుంచి కారులో 30లక్షల రూపాయల విలువచేసే 200 కేజీల గంజాయి కొనుగోలు చేసి తీసుకోస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం సమీపంలోని వి వెంకటాయపాలెం వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఉండటంతో కారును వేగంగా నడుపుకుంటూ ప్రయాణికులతో కూడిన ఆటోను బలంగా ఢీకొట్టారు. ఆటో, కారు బోల్తాపడ్డాయి. ఆటోలోని ప్రయాణికుడు మృతి చెందాడు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం కారును పరిశీలించగా 200 కేజీల 100 గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఇద్దరు నిందితులను అదుపులో తీసుకోగా, మరో నిందితుడు ఇషాక్ పరారీలో ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయాధికారి కె ఉమాదేవి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

రోడ్డు మరమ్మతు చేయాలని నిరసన



యువకుడితో మాట్లాడుతున్న పోలీసులు

గన్నేరువరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తన ఇంటి ఎదుట వరద నీరు ఆగి బురదమయం అవుతోందని, రోడ్డు మరమ్మతు చేసే వరకు ఎవరినీ వెళ్లనీయనని రోడ్డుకు అడ్డంగా చెట్ల మొద్దులను పెట్టి నిరసన తెలిపాడు వెదిర శ్రీకాంత్ అనే యువకుడు. మండల కేంద్రం నుంచి పారువెళ్లకు వెళ్లే దారిలో ఎస్సీ కాలనీలో చిన్నపాటి వర్షానికే తన ఇంటి ఎదుట వరదనీరు చేరి కుంటను తలపించే విధంగా ఉంటుందన్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వెదిర శ్రీకాంత్ అనే యువకుడు రోడ్డుకు అడ్డంగా మొద్దులను పెట్టి నిరసన తెలిపాడు. రోడ్డుపై వాహనాలు ఆగిపోవడంతో విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వెంకటిరెడ్డి యువకుడికి నచ్చచెప్పే ప్రయత్నం చేయగా వాగ్వాదానికి దిగాడు. దీంతో కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడకు చేరుకొని యువకుడిని సముదాయించి రోడ్డుపైన పెట్టిన మొద్దులను తొలగించారు.

గొల్లపల్లిలో చోరీ.. బంగారం, నగదు అపహరణ

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరుగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండి సమ్మయ్య నెల రోజుల నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులు పని నిమిత్తం ఇంటికి వచ్చి తిరిగి ఆసుపత్రికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని భావించిన నిందితులు ఇంట్లోకి చొరబడి 18 తులాల వెండితో పాటు మూడు తులాల బంగారం, ఎనిమిది వేల నగదును అపహరించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటికి తాళాలు సైతం పగలగొట్టి ఎత్తుకొని వెళ్లారని, పక్కింటి వారు సమాచారం ఇస్తే ఇంటికి వచ్చి చూశామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలానికి బ్లూ కోల్ట్స్ పోలీసులు చేరుకొని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయంలో దొంగతనం

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయ గేటును లేపి లోనికి ప్రవేశించారు. కార్యాలయ తలుపుల తాళాలను పగులకొట్టి అందులోని విద్యుత్ మోటార్లు, బోరులకు సంబంధించిన పరికరాలు, ఇనుప సామాను ఎత్తుకెళ్లారు. మంగళవారం గ్రామపంచాయతీ సిబ్బంది కార్యాలయానికి వెళ్లగా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి అధికారులకు సమాచారం అందించారు. గ్రామ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయగా స్థానిక సీఐ సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరు, సీసీ ఫుటేజిని పరిశీలించారు.

ఏసీబీకి చిక్కిన సర్వేయర్

- సర్వే రిపోర్టు కోసం ఫోన్ పే ద్వారా లంచం



ఏసీబీకి చిక్కిన సునీల్, రాజేందర్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) ఫోన్ పే అవినీతి చేపను ఏసీబీ అధికారులకు పట్టించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఓ రైతు ఎనిమిది నెలల క్రితం తన భూమి సర్వే చేయాలని మండల సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. సర్వే చేసి రిపోర్టు ఇవ్వడంలో సర్వేయర్ పెండ్యాల సునీల్ డబ్బులు డిమాండ్ చేశాడు. తన ప్రైవేట్ సర్వేయర్ కె రాజేందర్‌రెడ్డి ద్వారా మంతనాలు జరిపారు. 20 వేల రూపాయల డిమాండ్ చేయగా పదివేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో రైతు జూలై 2న ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు చెప్పిన ప్రకారం నగదు ఇచ్చేందుకు చేసే ప్రయత్నం విఫలం కావడంతో ఫోన్‌పే ద్వారా రాజేందర్‌రెడ్డికి డబ్బులు పంపించమని సర్వేయర్ సునీల్ చెప్పాడు. దీంతో రాజేందర్‌రెడ్డికి జూలై 9న రైతు 10 వేలు ఫోన్ పే చేసిన వెంటనే రాజేందర్‌రెడ్డి సునీల్‌కు ఫోన్‌పే చేశాడు. ఏసీబీ అధికారులు శాంతినగర్‌లో భూమి సర్వే చేస్తుండగా సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. రిజిస్టర్ కేస్ ఆఫ్ అదర్(ఆర్‌సీవో) కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామస్థులతో ఏసీపీ సమావేశం

వీణవంక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామస్థులతో హుజూరాబాద్ ఏసీపీ మాధవి మంగళవారం సమావేశం నిర్వహించారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థులు 34 రోజులుగా కొండపాక గ్రామంలోని మానేరు వాగులోని ఇసుక క్వారీలో లారీలపై పరదలు కట్టుట కోసం రిలే నిరహార దీక్షలు చేస్తున్నారు. ఏసీపీ మాధవి రెండు గ్రామాల నాయకలను పెద్దలతో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కొండపాక గ్రామస్థులు పరదలు కట్టుట నిలిపివేయాలని కోరారు. స్థానిక ఎన్నికల అనంతరం సమస్యకు పరిష్కారం చూపెడుతామని ఇరుగ్రామాల ప్రజలు తొందరపడద్దన్నారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థులు ధర్నాలు, దీక్షలు, రాస్తారోకో చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి తదితరులు ఉన్నారు.

రేపు ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

సుల్తానాబాద్, ఆగస్టు 12: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ నెల 14న వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో వివిధ సందర్భాల్లో పట్టుకున్న ద్విచక్ర వాహనాలను, ఆటోలను 14న గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా మధ్యనిషేద, ఎక్సైజ్ అధికారి సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ గురునాథ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సకాలంలో వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఒకరికి మించి మరొకరు..

- ప్రమాదకరంగా డ్రైవింగ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్లు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం అంటూ అధికారులు ఊదరకొడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే అందుకు విరుద్ధంగా ఉంటోంది. తాజాగా హుజూరాబాద్ డిపోనకు చెందిన ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు చేసిన ప్రమాదకర డ్రైవింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం కలకలం రేపుతోంది. జమ్మికుంట బస్‌స్టేషన్ నుంచి హుజూరాబాద్ ఆర్టీసీ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులు హుజూరాబాద్ వైపునకు ఒకే సమయంలో బయల్దేరాయి. ఆర్టీసీ డ్రైవర్లు ఒకరిని మించి మరొకరు ప్రమాదకరంగా ఇతర వాహనాలు వెళ్లకుండా ఓవర్ టేక్ చేస్తూ బస్సులను నడిపారు. దీంతో ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. వేరే వాహనాలు వెళ్లకుండా ప్రమాదకరంగా ఆర్టీసీ బస్సులను నడుపుతుండగా వెనుకవస్తున్న వాహనదారులు వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో వైరల్‌గా మారింది.



పక్కపక్కనే ప్రమాదకరంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులు

కుక్కల దాడిలో.. మనుబోతుకు గాయాలు

కొడిమ్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపేట అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం రేసు కుక్కల దాడిలో మనుబోతుకు గాయాలయ్యాయి. మనుబోతు కోనాపూర్ గ్రామంలోకి రాగా గ్రామస్థులు రక్షించి అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీశాఖ కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో బీట్ అధికారి ప్రవీణ్, బేస్ క్యాంప్ సభ్యుడు మహేందర్ మనుబోతును మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో వైద్యాధికారి రాకేష్‌తో చికిత్స చేయించారు. అనంతరం మండలంలోని సూరంపేట అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.



గాయపడి గ్రామంలోకి వచ్చిన మనుబోతు

మూడు రోజులైనా అదుపులోకి రాని మంటలు

- రూ.1.67కోట్ల విలువైన ఆస్తి నష్టం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం అగ్నిప్రమాదం జరగ్గా మంగళవారం కూడా మంటలు అదుపులోకి రాలేదు. అగ్ని ప్రమాదంలో రూ.1.67కోట్ల నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. మూడు రోజుల నుంచి రాత్రింబవళ్లు పోలీస్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, సివిల్‌సప్లయిస్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మెట్‌పల్లి, జగిత్యాల అగ్నిమాపక కేంద్రాల నుంచి వాహనాలను రప్పించారు. దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎక్స్‌కవేటర్లతో గోదాం చుట్టూ గోడలను బద్దలుకొట్టి అందులోంచి కాలుతున్న గోనె సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేస్తున్నారు. గోదాంలో గోనె సంచుల కింద కట్టెలు వేసి ఉండడంతో మంటలు అదుపులోకి రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదంలో మార్కెట్ గోదాం పూర్తిగా దెబ్బతిన్నదని అధికారులు పేర్కొన్నారు. అగ్ని ప్రమాదంపై సివిల్ సప్లయిస్, మార్కెట్ కమిటీ శాఖ అధికారులు పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

గోదాంలో సివిల్ సప్లయిస్ శాఖకు చెందిన వాడిన సంచులు 2018 సంవత్సరం నుంచి నిల్వ చేస్తున్నారు. గోదాం కిరాయి ప్రతి నెల మార్కెట్ కమిటీకి 38వేల రూపాయలు చెల్లిస్తున్నారు. గోదాంలో నిల్వచేసిన సంచులకు ప్రతి సంవత్సరం టెండర్ వేయాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఏడు సంవత్సరాల నుంచి గోనె సంచులను గోదాంలో నిల్వ చేస్తున్నారు. దీంతో అగ్నిప్రమాదంలో గోదాంలో ఉన్న గోనె సంచులన్నీ కాలిపోగా వాటికి ఇన్సూరెన్స్ ఉందని అధికారులు తెలిపారు. డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్, ఎస్సైలు కిరణ్‌కుమార్, తహసీల్దార్ నీత, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్, గోదాం ఇన్‌చార్జి సురేష్‌లు అక్కడే ఉండి ఫైర్ సిబ్బందికి సూచనలు సలహాలు ఇస్తున్నారు.



మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంను పరిశీలిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

మంటలు త్వరగా ఆర్పేలా చర్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మార్కెట్ యార్డులోని గోదాంలో మంటలు త్వరగా ఆర్పేలా చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఫైర్ సిబ్బందికి సూచించారు. ప్రమాదం జరిగిన గోదాంను ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రమాదాన్ని నివారణకు చేపట్టిన చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన సంచులను వెంటనే ఇతర ప్రదేశానికి తరలించాలని, మంటలు ఇతర గోదాంలతో పాటు చుట్టున్న ఇళ్లకు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, తహసీల్దార్ నీత, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ప్రమాద కారణాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

రాష్ట్రపతిని కలిసిన అంతర్గాం కస్తూర్బా విద్యార్థులు





అంతర్గాం కస్తూర్బా విద్యార్థులను అభినందిస్తున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరించిన విద్యార్థి సహస్ర

అంతర్గాం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్‌లో రెండోస్థానం పొందిన అంతర్గాం కస్తూర్బా విద్యార్థులు ఈ నెల 9న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును కలిశారు. కస్తూర్బా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దీక్ష షార్ట్‌ఫిల్మ్‌ను చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. షార్ట్‌ఫిల్మ్‌ను చూసిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము విద్యార్థులను తన కార్యాలయానికి పిలిపించుకుని అభినందించారు. ఉపాధ్యాయురాలు లత, స్కూల్ కెప్టెన్ ఎలిగేటి సహస్ర ఆధ్వర్యంలో రాష్ట్రపతిని కలిశారు. తెలంగాణ నుంచి తమకు అవకాశం వచ్చిందని వారు పేర్కొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాల పెంపునకు 'ఉన్నతి'



మాట్లాడుతున్న ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ

గణేశ్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడానికి మంగళవారం ఉన్నతి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఇది ఒక గొప్ప అవకాశమని, సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం కరీంనగర్ జోన్ బాధ్యులు ప్రవీణ్ కుమార్, సామ్యూల్ మాట్లాడుతూ నెల రోజులు కొనసాగే ఉన్నతి తరగతులను సద్వినియోగం చేసుకొని డిగ్రీ కాగానే ఉద్యోగం సంపాదించుకోవాలన్నారు. టీఎస్‌కేఈసీ కోఆర్డినేటర్ రాజేష్, డాక్టర్ బూర్ల నరేష్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఆసుపత్రిని సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందం



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఫైర్ సేఫ్టీపై సిబ్బందికి వివరిస్తున్న బృందం

హుజూరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రోగులకు అందుతున్న సేవలపై ఆస్పత్రి సిబ్బందితో చర్చించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా క్వాలిటీ మేనేజర్ సాగర్ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్ నిర్వహించి, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి, రోగులకు వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్..



నేడు ఎడమచేతి వాటం దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : 'కుడి ఎడమైతే పొరపాటులేదోయ్' అని అన్నాడు ఓ సినీ కవి. నిత్య జీవితంలో పనులకు అందరూ కుడి చేతిని వినియోగిస్తే కొందరు ఎడమచేతితో అవలీలగా చేస్తూ ఆకర్షిస్తారు. కుడి చేతి వారితో సమానంగా చేయగలుగుతారు. ఎడమచేతితో పనులు చేయడం అలవాటో, పొరపాటో తెలియదు గానీ ఓ విలక్షణత మాత్రం వారిలో కనిపిస్తుంది. ఈ అలవాటుకు ఓ ప్రత్యేక రోజు ఉంది. ఆగస్టు 13న అంతర్జాతీయ ఎడమచేతివాటం దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. తొలిసారి 1976 ఆగస్టు 13న నిర్వహించారు. ఎడమచేతివాటం వారు ఎదుర్కొంటున్న అసౌకర్యాలపైనా, ఇతర సమస్యలపైనా అవగాహన కల్పించడం, వాటిని అధిగమించడానికి ఎడమచేతివాటం వారిని ప్రోత్సాహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. పోలియో, ప్రమాదాల బారిన పడిన వారు, ఎడమచేతివాటం ఉన్నవారు అన్నిరంగాల్లో రాణిస్తారని, మరికొందరు కాస్త మందకొడిగా ఉంటారని చెబుతున్నారు. ఎడమచేతివాటం ఉన్నవారు ఎక్కువ శాతం క్రీడలు, కళారంగాల్లో రాణిస్తారు. పాఠశాలలు, కళాశాలలతోపాటు కార్యాలయాల్లో చాలామంది ఎడమచేతితో పనులు చేయడం, రాయడం చూస్తుంటాం. ఎడమచేతివాటంతో వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది.

చిన్నప్పటి నుంచి అలవాటు : జి.ఉజ్వల, హిందీ ఉపాధ్యాయిని, సిద్ధార్థ స్కూల్



నాకు చిన్నప్పటి నుంచి ఎడమచేతితో రాయడం అలవాటు. ఇబ్బంది లేకుండా రాస్తాను. మా బాబు రచిత్ (4వ), పాప రక్షిక (యూకెజి) కూడా ఎడమ చేతితోనే రాస్తారు.

ఎడమ చేతివాటంతో ప్రత్యేక గుర్తింపు
పి.అభినందన్, 9వ, బ్లూబెల్స్ స్కూల్



ఎడమచేతితో రాయడంతో నాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎడమచేతితో గుండ్రంగా, అందంగా రాయగలను. చిన్నప్పటి అలవాటు స్థిరమైపోయింది. ఎడమచేతితో రాస్తేనే రాసినట్లుగా అనిపిస్తుంది.

చల్లంగా చూడు పోచమ్మ తల్లీ..



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



బద్దిపోచమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆంధ్రజ్యోతి (ఆగస్టు 12) : పిల్లాపాపలను, పాడి పంటలను చల్లగా చూడు బద్ది పోచమ్మ తల్లీ. అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామిరిని దర్శించుకున్న భక్తులు మంగళవారం ఉదయం మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని శివసత్తుల ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలు, సంకన పిల్లలతో గంటల తరబడి ఆలయంలోకి చేరుకున్న భక్తులు పట్నాలు వేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు.

రాజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 5 లక్షల విరాళం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.5 లక్షల 116 విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో రాధాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ముస్కు కార్తీక్ రెడ్డి- సుష్మ దంపతులు, వారి పిల్లలు ఆరుష్, కియాన్‌లు రాజరాజేశ్వర స్వామి పేరుతో విరాళం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ ఈవో రాధాబాయికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అశోక్‌కుమార్, ఉద్యోగులు శ్రీనివాస్ శర్మ, బొడుసు మహేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం...

వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వరస్వామి ఆలయంలో శత వారం సందర్భంగా 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. నిర్వాహకులు మోటూరు మధుసూదన్ ఆధ్వర్యంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హిందు ఉత్సవ కమిటీ సభ్యులు మోటూరి మధు, గడప కిషోర్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన అంజన్న క్షేత్రం

మల్యాల: కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసంకు తోడు మంగళవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొవడానికి బారులు తీరారు. అనంతరం అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. బేతాళుడు, రాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. అంజన్న దర్శనంకు కొండగట్టుకు వచ్చిన తాటిపల్లికి చెందిన రోషిని భక్తురాలు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా అది స్వీపర్ లక్ష్మికి దొరకడంతో అవుట్ పోస్టు పోలీసులకు అప్పగించింది. దీంతో విచారణ జరిపి ఏఎస్సై చిలుక శ్రీనివాస్ భక్తురాలికి సెల్‌ఫోన్ అప్పగించారు.

ధర్మపురిలో సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి: సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ గణ పతి ఆలయంలో మంగళవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.



ధర్మపురిలో విశేషాలంకరణలో గణపతి స్వామివారు





బోనాలతో మహిళలు, కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం



రేషవేణి మహేష్

ధర్మారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనాలని ధర్మారం మండల యువకుడికి ఆహ్వానం అందింది. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన రేషవేణి మహేష్ యువశక్తి యూత్ స్థాపించి కొంత కాలంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. సామాజిక సేవా రంగంలో చేస్తున్న కృషికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ, నెహ్రూ యువ కేంద్రాలు దేశంలోని వంద మందిని భారత్ వలంటీర్లుగా ఎంపిక చేసింది. ఎంపికైన వంద మందిలో ధర్మారం మండలానికి చెందిన మహేష్ ఉన్నారు. గతంలోనూ ఢిల్లీలో నిర్వహించిన మేరీ మాటి, మేరీ దేశ్ కార్యక్రమాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మహేష్ ప్రాతినిధ్యం వహించారు. ఈ అవకాశం కల్పించినందుకు అధికారులకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు రేషవేని మహేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 5,658 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీలోకి 5,658 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 44.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,658 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథ కానికి 360 క్యూసెక్కుఉల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 135 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 482 క్యూసెక్కుల నీరు ఆవిరిఅవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 39.254 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 7.104 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

వారంలోగా దళితుల.. భూసమస్యను పరిష్కరించాలి

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- గోపాల్‌పూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే, కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్

గన్నేరువరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వారంలోగా దళితుల భూ సమస్యను పరిష్కరించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని గోపాల్‌పూర్, తిమ్మాపూర్ మండలంలోని జూగుండ్ల గ్రామాల సరిహద్దులో ఒక రైతుకు, దళితులకు మధ్య నెలకొన్న భూవివాదాన్ని పరిష్కరించేందుకు కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ఏడీ ప్రభాకర్‌తో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం గోపాల్ పూర్, జూగుండ్లలో పర్యటించి వివాదంలో ఉన్న భూమిని పరిశీలించారు. గోపాల్ పూర్ గ్రామానికి చెందిన దళితులు కొంపెల్లి మల్లయ్య, వీరయ్య, నర్సయ్య, ఎల్లయ్యతో పాటు జూగుండ్ల గ్రామానికి చెందిన శ్రీగిరి కనుకయ్యకు చెందిన సర్వేనంబర్ 178లో సుమారు ఎనిమిదేకరాల వ్యవసాయ భూమిపై ఏళ్ల తరబడి వివాదం నెలకొంది. ఈభూమి రికార్డుల్లో దళితుల పేరున ఉన్నప్పటికీ మోఖాపై లేదని, తమ భూమి ఆక్రమణకు గురైందని దళితులు ప్రజావాణిలో కలెక్టర్‌కు, ఆర్డీవోకు దరఖాస్తు చేసుకున్నారు. సమస్యను పరిశీలించేందుకు జిల్లా యంత్రాంగం గ్రామాలకు కదిలివచ్చారు. అధికారుల ముందు భూమి మాదంటే మాదని బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇరు గ్రామాల్లో భూసమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే జిల్లా అధికార యంత్రాంగాన్ని తీసుక విచ్చినట్లు వివరించారు. ఇరు గ్రామాల భూమి రికార్డు మ్యాపులను అధికారులు పరిశీలించారన్నారు. భూమి కొలతలు, హద్దులు తేల్చాలని వారం లోగా భూసర్వేను చేపట్టి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇరువర్గాలు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో గన్నేరువరం, తిమ్మాపూర్ మండలాల తహసీల్దార్లు జక్కని నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఆధార్‌లో మార్పులు

- కేరాఫ్ వివరాలు తొలగింపు
- తండ్రి, భర్త పేర్లు ఇకపై ఉండవు




ఐదేళ్లు దాటిన చిన్నారులకు అప్‌డేట్ తప్పనిసరి

చొప్పదండి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డు లేకుంటే ప్రస్తుతం ఏ పని జరగడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధార్‌కార్డు వివరాల్లో సైతం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తున్నారు. తాజాగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధార్‌కార్డులో కొన్ని మార్పులు చేసింది. ఇక నుంచి ఆధార్ కార్డులపై కేరాఫ్ స్థానా న్ని తొలగించింది.

తండ్రి, భర్త పేర్లు లేకుండానే వ్యక్తి పేరు, చిరునామాతో నూతన విధానం అమల్లోకి తెచ్చింది. గతంలో తండ్రి, భర్త పేర్లతో కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, వాటి స్థానంలో కేరాఫ్ ఏర్పాటు చేసింది. ఈ విధానంలోనూ ఇబ్బందులు తప్పడం లేదని సంస్థ గుర్తించింది. ఈ విధానాన్ని పూర్తిగా తొలగించినట్లు యూ ఐడీఏఐ ప్రకటించింది. ఇక నుంచి ఆధార్ అప్‌డేట్ చేసుకున్న వ్యక్తులకు, వివాహం జరిగిన మహిళలకు భర్త పేరు లేకుం డానే చిరునామా మార్పులు ఉంటాయని స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌లో చిరునామా మార్చుకునే విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు సమయంలో బయో మెట్రిక్ విధానం ఉండదని, ఐదేళ్ల దాటితే వారికి తప్పనిసరిగా బయోమెట్రిక్ నమోదు చేయించాలని యూఐడీఏఐ సూచించింది. ఏడేళ్ల దాటినా బయోమెట్రిక్ ఇవ్వకపోతే ఆధార్ కార్డులు డియాక్టివేట్ అవుతాయని యూఐడీ ఏఐ తెలి పింది. ఏడేళ్లలోపు అప్‌డేట్ చేసుకున్న వారు పది హేనేళ్లకు మరోసారి అప్‌డేట్ చేసు కోవాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

గంగాధరలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



ఇల్లంతకుంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని గంగాధర ఆలయంలో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రావణమాస మంగళవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సామూహిక కుంకమపూజల అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మూగు నాగరాజుశర్మతో పాటు మహిళలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్



ఏఐఎస్ఎఫ్ జెండా ఎగురవేస్తున్న సృజన్‌కుమార్

గణేశ్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏఐఎస్ఎఫ్ లక్ష్యమని, దేశవ్యాప్తంగా విద్యార్థులకు అండగా నిలిచిన ఏకైక విద్యార్థి సంఘమని మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా మంగళవారం గీతభవన్ చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దేశంలోనే మొట్టమొదటగా ఏర్పడిన ఏకైక విద్యార్థి సంఘమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది బలిదానాలు చేసిన గొప్ప చరిత్ర ఉందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండి పడ్డారు. బడ్జెట్ కేటాయంపు లో విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించడం లేదన్నారు. ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలని, ఫీజు నియంత్రణ చట్ట అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, మచ్చ రమేష్, హేమంత్ మాజీ నాయకులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపెల్లి రాజు, బోనగిరి మహేందర్, తాళ్లపల్లి లక్ష్మణ్, యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, నగర నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మంగళగౌరి వ్రతాలు

కోరుట్ల, ఆగస్టు 12 : శ్రావణ మంగళవారం పురస్కరించుకొని పట్టణంలోని కోటి నవదుర్గ దేవలయంలో సామూహిక మంగళగౌరి వ్రతాలు సాగాయి. పద్మశాలికులోన్నతి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో మార్కండేయ మందిరం, కోటి నవదుర్గ దేవలయంలో మంగళగౌరి వత్రాలు వేద పండితులు ప్రదీప్ శర్మ, శ్రీధర్ శర్మ, సంతోష్ శర్మ, షాకేత్‌శర్మల మంత్రోచ్చరణ మధ్య సాగింది. మహిళలు విష్ణుశాస్త్ర నామపారాయణం జరిపారు.



●సంక్షిప్తంగా..

కరీంనగర్ టౌన్: తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన దామరకొండ సంతోష్ పటేల్‌ను మంకమ్మతోట మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ముప్పిడి సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి దేవేందర్, పల్లె రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

భగత్‌నగర్: బావుపేట అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా ఎల్కతుర్తి అరుణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మానకొండూర్: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ చారిటబుల్ వైద్యులు భాస్కర్ మడేకర్ నేత్ర ఆసుపత్రి, రేకుర్తి వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ సహకారంతో మానేరు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో మండలంలోని చెంజర్ల గ్రామంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ కరీంనగర్ అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్, కృష్ణ, సురేష్ రమేశ్ ఉన్నారు.

తిమ్మాపూర్: కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో సెంట్రల్ రిటైర్డ్ ఉద్యోగుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి డీఎంవో హర్షిత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, మనోజ్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దురదృష్టకరమని బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి అన్నారు. మంగళవారం ఇల్లందకుంట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైద్రాబాద్‌లోని పెద్దమ్మగుడి దగ్గర కుంకుమార్చనకు హిందూ సంఘాల పిలుపు మేరకు హైదరాబాద్‌కు బయల్దేరుతున్నారనే సమాచారంతో ముందస్తుగా బీజేపీ, హిందూ సంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం సిగ్గుచేటన్నారు.

జమ్మికుంట రూరల్: రాహుల్‌గాంధీ అరెస్ట్ హేయమైన చర్య అని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.

శంకరపట్నం: మేడ్చల్‌లోని కొంపల్లి నిమ్మల గార్డెన్స్‌లో మెదక్ పార్లమెంటరీ కాంటెస్ట్ సభ్యుడు నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి ఆవిర్భావ సభకు ముదిరాజ్‌లు తరలి వెళ్లారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు ఫిషర్ మెన్ జిల్లా అధ్యక్షుడు బండి మల్లేష్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

భగత్‌నగర్: ఢిల్లీలో జరిగిన డాక్టర్ కలాం స్టార్ట్ అప్ యూత్ అవార్డు కార్యక్రమానికి కరీంనగర్ బీజేపీ మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యక్షుడు బషీరుద్దీన్, క్యాదర్శి బల్బీర్‌సింగ్‌తో కలిసి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

యూరియా కోసం పడిగాపులు



కొండపల్కలో బారులుదీరిన రైతులు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపాక ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో యూరియా కోసం మంగళవారం రైతులు బారు లుదీరారు. సరిపడా స్టాక్ లేకపోవడంతో కొంత మంది రైతులు ఖాళీ చేతులతో వెళ్లిపోయారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో గతంలో ఉన్న డీసీఎంఎస్ కేంద్రం ఎత్తివేయడంతో ప్రస్తుతం వారి ట్రేడింగ్ ఫెర్టిలైజర్ షాపునకు యూరియా బస్తాలను కేటాయించారు. విషయం తెలుసుకున్న రైతులు షాపు తెరవక ముందే తరలివచ్చి చెప్పులను వరుసలో పెట్టి సదరు షాపు యజమాని కోసం ఎదురుచూశారు. యజమాని రాగానే బస్తాల కోసం ఎగబడడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఏడీఏ ప్రియదర్శిని, ఏవో త్రివేదిక పరిస్థితిని సమీక్షించారు.

మానకొండూర్: మండలంలోని మానకొండూర్ సొసైటీ పరిధిలోని కొండపల్కల, మద్దికుంట, ఊటూర్ సొసైటీ పరిధిలోని వెల్ది, రంగపేట గోదాముల వద్ద మంగళవారం యూరియా కోసం క్యూలో గంటల తరబడి నిలబడ్డారు.

గంగాధర: మండలంలోని గంగాధర, కురిక్యాల, బూరుగుపల్లి వ్యవసాయ పరపతి సంఘాల్లో ఉదయం ఐదు గంటల నుంచే రైతులు బారులుదీరారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని సొసైటీ ఎదుట రైతులు యూరియా కోసం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో వచ్చి గొడుగులు పట్టుకొని క్యూలో ఉన్నారు. మండలంలో సోమవారం వరకు 10 టన్నుల యూరియా ఉందని, మరో 40 టన్నుల యూరియా వస్తుందని అధికారులు ప్రకటన విడుదల చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి స్యనారాయణ ఆదేశించారు. మంగళవారం ఎల్‌ఎండీ క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బిల్లుల చెల్లింపు ఆలస్యం కావద్దన్నారు. ఎంపీడీవోలు వరలక్ష్మి, కృష్ణప్రసాద్, సురేందర్, శ్రీనివాస్, ప్రవీణ్, శశికళ పాల్గొన్నారు.

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గంగిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్‌ల్యాబ్‌కు భూమిపూజ చేశారు. గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ ఓదెలు, వైస్‌చైర్మన్ తిరుమల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సంపత్‌గౌడ్, సాగర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

సైదాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెన్కేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు కేంద్రతి హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తరుఫున బీజేపీ నాయకులు మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం దేవేందర్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సాహితీవేత్తలకు పురస్కారాలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : శ్రావణి సాహితీ, సాంస్కృతిక సమాఖ్య త్రిదశాబ్ది ఉత్సవాల సందర్భంగా నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం సాహితీవేత్తలకు పురస్కారాలు అందజేశారు. సాహితీవేత్త, అవధాని డాక్టర్ గంద్ర లక్ష్మణరావు, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణకు శ్రావణీ సమాఖ్య పురస్కారాలను, విశ్రాంత ఉపన్యాసకుడు వంగపల్లి ప్రభాకర్‌రావుకు గౌరవ పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దిండిగాల విఠల్, పుప్పాల హనుమంతరెడ్డి, కట్ట వేణు, బూర్ల చంద్రశేఖర్, బూర్ల నరేశ్, లావణ్య, రమ్యకృష్ణ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన 'అల్ఫోర్స్' నరేందర్ రెడ్డి



సీఎంను సన్మానిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వీఎన్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడంతోపాటు ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తుండడంతో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

గణేశ్‌నగర్,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని తెలంగాణ యువజన సమితి జిల్లా అధ్యక్షుడు రాష్ట్ర ఉత్తమ యువజన అవార్డు గ్రహీత సత్తినేని శ్రీనివాస్ తెలిపారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తెలంగాణ యువజన సమితి ఆధ్వర్యంలో రాంనగర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మంగళవారం మొక్కలు నాటరు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత సామాజిక సేవను అలవర్చుకోవాలని, వివేకానందుని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు జిల్లాలోని యువజన స్వచ్ఛంద సంస్థలు మొక్కలు నాటి గ్రామీణ ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కని సాయిరాం, ఉపాధ్యక్షులు నాగుల కిరణ్, కార్యదర్శి సతీష్,సుజాత,శ్రవణ్ కుమార్, రమేష్, సునీత పాల్గొన్నారు.

చెడు అలవాట్లతోనే యువతలో హార్ట్ ఎటాక్



అవగాహన కల్పిస్తున్న కార్డియాలజిస్టు అనిష్

సుభాష్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లతోనే యువత హార్ట్ ఎటాక్ బారిన పడుతున్నారని మెడికవర్ ఆస్పత్రి కార్డియాలజిస్టు విభాగం వైద్యులు తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో గుండె వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత మద్య పానం, దూమపానం, జంక్‌ఫుడ్, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారన్నారు. దీంతోపాటు మారిన జీవన శైలీ, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం కూడా కారణాలన్నారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, కార్డియాలజీ వైద్యులు అనీష్ పబ్బ, వాసుదేవరెడ్డి, కార్డియోథొరాసిక్ సర్జన్ రాజేంద్ర ప్రసాద్, క్రిటికల్ కేర్ నిపుణుడు ఉపేందర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్ నాగరాజు, సిటీ అనేసేషియా విషువర్ధన్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు



హవనం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆలయాల్లో మంగళవారం శ్రావణ అంగారక సంకటహర చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్యస్వామికి అభిషేక, అర్చన, అలంకారాలు చేశారు. పాతబజార్ గౌరీశంకరాలయంలో పురాణం మహేశ్వరశర్మ సహస్ర మోదక హవనం నిర్వహించారు. రాంపూర్ గిద్దెపెరుమాండ్ల ఆలయంలో మహేశ్వరశర్మ, శంకరశర్మ పూజలు, హవనం చేపట్టారు. చైతన్యపురి మహాశక్తి దేవాలయం, భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, భవానీశంకర, జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, కమాన్‌రోడ్ రామేశ్వర ఆలయంలో భక్తులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ షాపులకు బహిరంగ వేలం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో నగరపాలక సంస్థ స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌లో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ 22 షాపులు, బంకెట్ హాల్, డార్మెటరీ సూట్ రూమ్‌కు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాలపరిమితితో షాపులు కేటాయించినట్లు చెప్పారు. 1, 2, 11, 12, 13, 14, 18, 19 దుకాణాలు, రెండో అంతస్తులోని బంకెట్ హాల్, డార్మెటరీ సూట్ రూమ్‌కు ఎవరూ వేలం పాడలేదని తెలిపారు. వాటికి తిరిగి మరో తేదీన వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మోహియుద్దీన్, ఆర్‌వో శివప్రసాద్, ఆర్‌ఐలు కిష్టయ్య, కలీముల్లాఖాన్ పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు ఉల్లాస్ శిక్షణ

భగత్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో నిరక్షరాస్యుల విద్యాభివృద్ధికి ప్రత్యేకంగా రూపొందించిన ఉల్లాస్ శిక్షణను మంగళవారం నిర్వహించారు. మెప్మా పీడీ వేణుమాధవ్ రెడ్డి, ఎంఈవో ఆనందం, ఏపీఎం భువనచంద్ర పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

భగత్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదోతరగతి, ఇంటర్ అడ్మిషన్లు కొనసాగుతున్నట్లు ఎంఈవో ఆనందం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న చివరి తేదీ అని, వివరాలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల కొత్తపల్లి, ఎలగందల్ పాఠశాలల్లో సంప్రదించాలని సూచించారు.

అక్షరాస్యతతోనే సామాజిక చైతన్యం

గంగాధర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతతోనే సామాజిక చైతన్యం వస్తుందని ఎంపీడీవో రాము అన్నారు. గంగాధర ఉన్నత పాఠశాలలో నవభారత్ సాక్షరా భారత్ ఓరియంటేషన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంఈవో ప్రభాకర్‌రావు ఉన్నారు.

బ్యాగులు అందజేత

భగత్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని శాతవాహన యూనివర్సిటీ చౌక్ వద్ద వీధి వ్యాపారులకు రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బ్యాగులను అందజేశారు. పర్యావరణ పరిరక్షణ, లయన్ కొల్లూరి జితేందర్ జన్మదినం సందర్భంగా బ్యాగులు అందజేసినట్లు తెలిపారు. సభ్యులు జాడి బాల్‌రెడ్డి, ఈరెడ్డి తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



గ్రంథాలయ దినోత్సవంలో పాల్గొన్న సిబ్బంది, పాఠకులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయోద్యమ పితామహుడు, ప్రముఖ లైబ్రేరియన్ ఎస్‌ఆర్ రంగనాథన్ జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రేడ్-1 లైబ్రేరియన్ అర్జున్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేశారు. గ్రేడ్-3 లైబ్రేరియన్ సరిత పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి విద్యార్థులకు పుస్తకాల పఠనం, గ్రంథాలయ వినియోగం ప్రాధాన్యాన్ని వివరించారు. కళాశాల లైబ్రేరియన్ హఫీజ్ మియా, .పరీక్షల నియత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ బాలుర కళాశాలలో ప్రిన్సిపాల్ భవానీ గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. వైస్‌ప్రిన్సిపాల్ లావణ్య, లైబ్రేరియన్ డాక్టర్ అనిల్ కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ రజిత పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలో గ్రంథాలయ పరిపాలనాధికారి కనకలక్ష్మి ఆధ్వర్యంలో రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. చందుపట్ల జనార్దన్, తడికమళ్ల శేఖర్, రత్నం, వెంకన్న, సంజీవ్ ఉన్నారు.

నాలాలను ఆక్రమించిన వారిపై చర్యలు



పరిశీలిస్తున్న డీపీవో జగదీశ్వర్

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నాలాలను అక్రమించిన వారిపై చర్యలు తప్పవని డీపీవో జగదీశ్వర్ హెచ్చరించారు. మానకొండూర్‌లోని కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి పక్కన ఉన్న గణేష్‌నగర్, ఆదర్శనగర్ కాలనీల్లో నాలాలపై అక్రమ కట్టడాలను గ్రామ కార్యదర్శి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులుగా తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం తొలగించిన అక్రమ కట్టడాలతోపాటు నాలాలను డీపీవో పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నాలాలను ఆక్రమించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

'స్థానికం'పై దృష్టి

(5వ పేజీ తరువాయి)

సన్నాహాలు చేసింది. రాష్ట్రంలో 14 నుంచి 17వ తేదీ వరకు అతి భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణశాఖ ప్రకటించింది. ప్రకటన నేపథ్యంలో ప్రభుత్వం కూడా అలర్ట్ ప్రకటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాల కారణంగా ఎవరు ఎలాంటి నష్టాలకు గురికాకుండా చూసుకోవాలని కోరింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ బీసీ సభను వాయిదా వేసుకుంది. త్వరలోనే ఈ సభ నిర్వహించే తేదీని ప్రకటిస్తామని సభ నిర్వాహక బాధ్యులు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రకటించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుదవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టు ఏడీఈ లావణ్య ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 వరకు సప్తగిరికాలనీ, ప్రగతినగర్, టెలిఫోన్ క్వాటర్స్, శివనగర్, బతుకమ్మకాలనీ, మార్కండేయ నగర్, అల్కాపురికాలనీ శ్మశాన వాటిక ఏరియా, గిద్దెపెరుమాండ్ల గుడి, కోతిరాంపూర్ విజేత అపార్ట్‌మెంట్, చర్చి ఏరియా, ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు శ్రీనగర్‌కాలనీ, ఉమెన్స్ కళాశాల, ఆవాజ్‌బౌలి, కశ్మీర్‌గడ్డ, మైసమ్మ చెట్టు, రైతుబజార్, శాలిమార్ ఫంక్షన్ హాల్, ఫైర్ స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

గంగాధర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):రిజర్వేషన్లలో బీసీలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండలం బూరుగుపల్లిలోని తన నివాసంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

వీరహనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న వెలిచాల రాజేందర్‌రావు

భగత్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని రెడ్డిరామయ్య పల్లి మార్కెండేయ కాలనీలోని వీరహనుమాన్ దేవాలయ 26 వార్షికోత్సవ వేడుకల్లో కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మంగళవారం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు రాజేందర్‌రావును సన్మానించారు.

నిరంతరం యూరియా సరఫరా

చిగురుమామిడి అగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు యూరియా సరఫరా నిరంతరం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ మంగళవారం సూచించారు. మండల కేంద్రంలోని సొసైటీలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 858 మెట్రిక్ టన్నుల పైచిలుకు యూరియాను రైతులకు అందించామని, వదంతులను నమ్మవద్దని సూచించారు.

రాజీవ్ రహదారిపై స్టీల్ గడ్డర్స్ తొలగించాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారిపై ఇటీవల ఏర్పాటు చేసిన స్టీల్ గడ్డర్స్ తొలగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మాజీ మేయర్‌ను బీజేపీ నాయకుడు సునీల్‌రావు కోరారు.ఈ మేరకు కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 27న నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా భారీ విగ్రహాలను తీసుకురానున్నారని, స్టీల్ గడ్డర్స్ అడ్డంకిగా మారాయని అన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

చొప్పదండి/హుజూరాబాద్/జమ్మికుంట/ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మండలాల్లో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేశ్, సహాయ కార్యదర్శి రాము, జిల్లా కోశాధికారి విష్ణు, నాయకులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

కరీంనగర్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని చెర్లబూత్కూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎంఈవో రవీందర్ నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలను విద్యార్థులందరూ వేసుకోవాలని, పాఠశాలకు రాని విద్యార్థులకు మరుసటి రోజైన ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మనోహర్ తదితరులు ఉన్నారు.

కళాభారతిలో 16న కృష్ణాష్టమి వేడుకలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సకల కళల సాంస్కృతిక సంఘం, ప్రవీణ్ సల్వాజీ మ్యూజికల్ గ్రూప్ సంయుక్తంగా ఈ నెల 16వ తేదీన కళాభారతిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ సల్వాజి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. బాల బాలికలకు శ్రీకృష్ణ, గొల్లభామల వేషధారణ పోటీలుంటాయని పేర్కొన్నారు. 2 నుంచి 5, 6 నుంచి 12, 12 నుంచి 18 సంవత్సరాల వారిని 3 కేటగిరీలుగా విభజించామని తెలిపారు. పేర్ల నమోదు కోసం 7997887799 నంబరులో సంప్రదించాలని సూచించారు.

స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలి

కరీంనగర్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా స్థానిక ఎన్నికల్లో రజక యువత పోటీ చేయాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని కృష్ణానగర్, మధురానగర్‌లో రజక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రజకులను అన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలన్నారు.

బొమ్మకల్ బైపాస్‌లో స్టాపర్లను ఏర్పాటు చేయాలి

కరీంనగర్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్ బైపాస్‌లో స్టాపర్లను ఏర్పాటు చేయాలని, రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలని గ్రామ నాయకులు కోరారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజి వాకడే, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామికి వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన ట్రాఫిక్ ఏసీపీ సంబంధిత అధికారులను పంపి పరిశీలించారు. వాహనాలు నిలుపకుండా శాశ్వత పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ పాశం తిరుపతి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్ర సత్యప్రసన్నరెడ్డి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమపథకాలపై మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు విస్తృత ప్రచారం చేయాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి అన్నారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌లోపు జిల్లాలో కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కాం గ్రెస్ అభ్యర్థులు విజయం సాధించే దిశగా కష్టపడాలన్నారు. మహిళా కాంగ్రెస్ నాయరాళ్లు గాజుల సుకన్య, కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కళ్యాణి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరుతూ బీజేపీ పశ్చిమజోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పశ్చిమ జోన్ మాజీ అధ్యక్షుడు నరహరి లక్ష్మా రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు వాసు, రాము, ఉప్పరపల్లి శ్రీనివాస్, గుండారపు సంపత్, దేవేందర్, నరేష్, శంకర్, తిరుమల్ రెడ్డి, రాకేష్ పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఇంటి మీద తిరంగా జెండాను ఎగురవేయాలని మానవహారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి, మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి, అప్పని తిరుపతి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న మంత్రి ఓఎస్డీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

చిగురుమామిడి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం లేకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రబాకర్ ఓఎస్డీ డాక్టరు శ్రీనివాస్‌రెడ్డి, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మంత్రి అదనపు పీఏ మల్లేశంలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయాంలో మండలంలో వీవో, వీవోఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామంలో 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు మహిళలను మహిళా సంఘల్లో చేర్పించాలని సూచించారు. 50ఏళ్లలోపు వికలాంగులను గుర్తించి సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, ఏపీఎం రజిత, సీసీలు తదితరులు పాల్గొన్నారు.